ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
గురువారం, 17 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 31 | పేజీలు: 4 వెల: 5

# బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదు

## 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ

- దామాషా ప్రకారం లోక్‌సభ స్థానాలు పెంచితే డీలిమిటేషన్‌కు మద్దతు
- ఏఐను స్వీకరించి కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్




**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునే అవకాశం ఉందా అని ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. బీజేపీతో పొత్తు ఉండదని తేల్చిచెప్పారు. కేటీఆర్ బుధవారం ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్: ది స్టోరీ ఆఫ్ ఎ స్టార్టప్ స్టేట్ అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని రాజకీయాలు, పాలన, ప్రజా విధానాలు, సాంకేతికత తదితర అంశాలపై వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. డీలిమిటేషన్ అంశంపై కేటీఆర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను దామాషా ప్రకారం పెంచితే డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడంలో బీఆర్ఎస్‌కు ఎలాంటి అభ్యంతరం ఉండదన్నారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం ప్రాతినిధ్యం ఉందని తెలిపారు. మొత్తం లోక్‌సభ స్థానాలను దామాషా ప్రకారం పెంచితే బిల్లుకు మద్దతు ఇవ్వడంలో సమస్య ఉండదని పేర్కొన్నారు.

**ఏఐను స్వీకరించి ముందుకు సాగాలి**

కృత్రిమ మేధస్సు, సాంకేతిక మార్పులపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానమిస్తూ.. ప్రతి పెద్ద సాంకేతిక పరివర్తన సమయంలోనూ ఆందోళనలు వ్యక్తమయ్యాయని అన్నారు.

........(తరువాయి 2లో)

# భారత్–న్యూజిలాండ్ వాణిజ్య బంధం

- దశాబ్దాల నిరీక్షణకు తెరదించిన ఒప్పందం
- 93-29 ఓట్లతో ఎఫ్‌టీఏ బిల్లుకు న్యూజిలాండ్ పార్లమెంట్ ఆమోదం
- 15 ఏళ్లలో భారత్‌లో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడుల లక్ష్యం



**కాకతీయ, నేషనల్ డెస్క్ :** దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కార్యరూపం దాల్చే దిశగా కీలక అడుగు పడింది. న్యూజిలాండ్ పార్లమెంట్‌లో బుధవారం జరిగిన ఓటింగ్‌లో భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏ బిల్లుకు 93-29 ఓట్లతో ఆమోదం లభించింది. అధికార నేషనల్ పార్టీతో పాటు ప్రతిపక్ష లేబర్ పార్టీ కూడా బిల్లుకు మద్దతు తెలిపింది. ఒప్పందం అమల్లోకి వచ్చే తేదీని ఇరు దేశాలు నిర్ణయించాల్సి ఉంది. అక్టోబర్ చివరి నాటికి అమలు చేసే అవకాశం ఉందని న్యూజిలాండ్ వర్గాలు వెల్లడించాయి.

........(తరువాయి 2లో)

రూ.110 కోట్ల కాంట్రాక్టు రూ.1,400 కోట్లకు ఎలా పెరిగింది?

త్వరలోనే ధరణి పార్ట్2 అక్రమాలు బయటపెడతాం

కేసీఆర్ కుటుంబ భూములపై 30 రోజుల్లో విచారణ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



ధరణి
తెలంగాణ ప్రభుత్వం



# ధరణి పేరుతో భూ దోపిడీ

## తెలంగాణ భూముల మొత్తం డేటా మాఫియా చేతుల్లోకి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:**

ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత మాజీ సీఎం కేసీఆర్ కన్ను భూములపై పడిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అది భూతంగా మారి తెలంగాణ సమాజాన్ని పట్టి పీడిస్తోందని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటాను బీఆర్ఎస్ నాయకులు మాఫియా చేతుల్లో పెట్టారని ఆరోపించారు. శాసనసభలో ధరణిపై జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారం బదిలీ చేసుకున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తప్పు చేసినవారు సభకు రాకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ తమ మెదడు ఉపయోగించి ధరణి రూపొందించామని గొప్పలు చెప్పుకున్నారని, అందులో వాస్తవం లేదన్నారు. రెవెన్యూ సమాచారాన్ని కేంద్ర సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేటు సంస్థలకు ఎందుకు అప్పగించారని ప్రశ్నించారు. రూ.110 కోట్ల విలువైన కాంట్రాక్టు రూ.1,400 కోట్లకు ఎలా పెరిగిందో విచారణ జరపాల్సిన అవసరం లేదా అని నిలదీశారు. 1982లో తీసుకొచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ రద్దు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**మాఫియా చేతుల్లోకి కోట్ల ఎకరాల డేటా**

2021 నాటికి 21,93,050 ఎకరాలను పార్ట్‌బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని సీఎం తెలిపారు. 2023 నాటికి ధరణి పేరుతో తెలంగాణ సమాజానికి తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని, ఇద్దరూ ఒకటేనని అన్నారు. కండువా వేసుకుంటే బీఆర్ఎస్ నేతలు, కండువా తీస్తే దళారీలుగా మారారని వ్యాఖ్యానించారు. తెలంగాణకు చెందిన 2.5 కోట్ల ఎకరాల భూముల సమాచారం మాఫియా చేతుల్లోకి వెళ్లిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రజల భూములకు సంబంధించిన సంపూర్ణ సమాచారాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని ధ్వజమెత్తారు. 22ఏ భూముల వ్యవహారాన్ని కేసీఆర్ సభలో ఉన్నప్పుడే బయటపెట్టాలని భావించానని, అది తెలిసే బీఆర్ఎస్

........(తరువాయి 2లో)




# ఎమ్మెల్యే రేవూరి వర్సెస్ కౌన్సిలర్లు

- పరకాల మునిసిపాలిటీలో అధికార పార్టీ అసమ్మతి సెగలు
- కౌన్సిల్ సమావేశానికి దూరంగా 7 మంది కౌన్సిలర్లు
- కోరం లేక అధికార పక్షానికి ఇబ్బందులు.. ఎమ్మెల్యే రేవూరికి గ్యాప్
- ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ కౌన్సిలర్ల నారాజ్
- హైదరాబాద్‌కు పిలిపించి సముదాయించినా.. కుదరని నమ్మకం
- పైకి కూల్.. లోపల కుతకుత.. పనులపై విజిలెన్స్‌కు బీఆర్ఎస్ నేత ఫిర్యాదు?!



4

# దసరాకు 13 రోజుల సెలవులు

- అక్టోబర్ 1 నుంచి 9 వరకు ఎస్ఏ-1 పరీక్షలు
- అక్టోబర్ 10 నుంచి 22 వరకు పాఠశాలలకు సెలవులు
- బతుకమ్మ, విజయదశమి నేపథ్యంలో వరుస సెలవులు
- తెలంగాణ విద్యాశాఖ తాజా ప్రకటన

3

# 22ఏ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

## ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే డైవర్షన్ రాజకీయాలు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కుట్రపూరితంగా సస్పెండ్ చేశారు

22ఏ జాబితాపై సీఎం చెప్పిన వివరాలే మా ఆరోపణలకు ఆధారం

భూభారతి, ధరణి వ్యవహారాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

రేవంత్ కుటుంబ ఆస్తులపై నా విచారణ జరిపించాలి

మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు




**కాకతీయ,తెలంగాణ బ్యూరో :**

ప్రజల సమస్యలు, 6 గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు తెరలేపుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. తమ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కుట్రపూరితంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. 22ఏ నిషేధిత భూముల జాబితాపై బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు నిజమని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఒప్పుకున్నారని పేర్కొన్నారు. భూభారతి, 22ఏ భూములు, గత మూడేళ్లలో జరిగిన భూ వ్యవహారాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్షంగా ప్రజల సమస్యలు, 6 గ్యారెంటీల అమలుపై ప్రశ్నిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి బురద రాజకీయాలతో ఎదురుదాడికి దిగుతున్నారని హరీశ్‌రావు అన్నారు. అవ్వాతాతలకు రూ.4,000 పింఛన్ ఇవ్వలేదని, మహిళలకు రూ.2,500 అందలేదని, విద్యార్థులకు భరోసా కార్డులు ఇవ్వలేదని పేర్కొన్నారు.

........(తరువాయి 2లో)



# తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జ్..

## ముకుల్ వాస్నిక్ పేరు తెరపైకి!

- మీనాక్షి నటరాజన్ స్థానంలో మార్పుపై కసరత్తు
- దాదాపు 10 నెలలు అందుబాటులో ఉండని పరిస్థితి
- సీనియర్లు, రేవంత్ వర్గం మధ్య సమన్వయమే లక్ష్యం
- నామినేటెడ్ పదవులు, స్థానిక ఎన్నికలపై దృష్టి
- దళిత నేతకు బాధ్యతలు అప్పగించే యోచన
- తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త సమీకరణాలకు అవకాశం

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మార్పు అంశం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతున్న ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్ స్టడీ టూర్ కోసం లండన్

........(తరువాయి 2లో)



# నా బ్యాంకు ఖాతాలు అన్‌ఫ్రీజ్ చేయండి

- కుటుంబ పోషణకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నా
- ఫ్రీజ్ చేసిన ఖాతాల్లో రూ.3 కోట్లు ఉన్నాయని పిటిషన్
- నిత్యావసరాలు, వైద్య ఖర్చులకు నగదు అవసరం
- ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి

3

# గుంపు మేస్త్రీ, గుంటనక్క కుమ్మక్కు వాస్తవం

- సీఎం ప్రస్తావించిన భూములపై సమగ్ర విచారణ జరపాలి
- అఫిడవిట్ కంటే గజం ఎక్కువున్నా ప్రభుత్వానికి అప్పగిస్తా
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

3



# ధరణి పేరుతో భూ దోపిడీ

**(మొదటిపేజీ తరువాయి)**

సభ్యులు సస్పెన్షన్‌కు గురయ్యేలా వ్యవహరించారని ఆరోపించారు. ధరణి విధానం 2010లో ఒడిశాలో ప్రారంభమైందని సీఎం వివరించారు. 2014లో కాగ్ ధరణిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిందన్నారు. 2018లో ధరణి కాంట్రాక్టును ఐఎల్ఎఫ్ఎస్ దక్కించుకుందని, ఆ సంస్థ ధరణిని టెరాసిస్ కంపెనీకి విక్రయించిందని విమర్శించారు. టెరాసిస్ కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందని ఆరోపించారు.

**ధరణి పార్ట్-2 అక్రమాలు త్వరలో**

ధరణి పేరుతో మొత్తం రూ.లక్ష కోట్ల భూకుంభకోణం జరిగిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై స్పెషల్ ఎంక్వయిరీ టీమ్ ఏర్పాటు చేసి నెల రోజుల్లో నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు చెప్పింది ధరణి పార్ట్1 మాత్రమేనని, త్వరలో ధరణి పార్ట్2 అక్రమాలను బయటపెడతామని ప్రకటించారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఉన్నప్పుడే పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. టీజీఐఐసీ భూముల్లో జరిగిన అక్రమాలను బడ్జెట్ సమావేశాల్లో





బయటపెడతామని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. 30 రోజుల్లో విచారణ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో 295 ఎకరాల భూమి ఉందని, 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందా లేదా అన్నది తేల్చాలని అన్నారు. 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందనే విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమి ఉంటే పేదలకు పంచుతామని ప్రకటించారు. సిద్దిపేటలో కేసీఆర్ కుటుంబానికి 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123.19 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37 ఎకరాలు, జోగినపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్‌రావుకు 52 ఎకరాలు, కొండల్‌రావుకు 48 ఎకరాలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి 9 జిల్లాల్లోని 24 మండలాలు, 31 గ్రామాల్లో 439 ఎకరాల భూములు ఉన్నాయని తెలిపారు.

**హరీశ్‌రావు భూములపైనా ఆరోపణలు**

రంగనాయకసాగర్ పరిధిలో హరీశ్‌రావు భూములు కొన్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రిజర్వాయర్ కోసం భూసేకరణ చేసిన సమయంలో ఆ భూమిని జాబితా నుంచి తొలగించారని అన్నారు. రామంచ సర్వే నంబర్‌లోని 4.20 ఎకరాల్లో 1 ఎకరం తీసుకున్నారని తెలిపారు. భూసేకరణలో రైతులకు ఎకరాకు రూ.6.20 లక్షలు చెల్లించగా, హరీశ్‌రావు రైతుల నుంచి రూ.2.50 లక్షల చొప్పున భూములు కొనుగోలు చేసినట్లు రికార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. రంగనాయకసాగర్ ఫామ్‌హౌస్‌కు రూ.5.33 కోట్లతో బీటీ రోడ్డు వేయించుకున్నారని, సిద్దిపేట మున్సిపాలిటీ నిధులతో టెండర్లు లేకుండా రోడ్డు నిర్మించారని సీఎం ఆరోపించారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల భూములు, ఆస్తులపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జ్

**(మొదటిపేజీ తరువాయి)**

వెళ్లనున్న నేపథ్యంలో.. రాబోయే దాదాపు 10 నెలలపాటు ఆమె అందుబాటులో ఉండే అవకాశం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో తెలంగాణకు కొత్త ఇన్‌ఛార్జ్‌ను నియమించే ప్రక్రియను ఏఐసీసీ వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతున్నప్పటికీ.. పార్టీలో అంతర్గత విభేదాలు, వర్గపోరు, నాయకుల మధ్య సమన్వయ లోపం హైకమాండ్‌కు సవాలుగా మారాయి. దీనికి తోడు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అనుభవజ్ఞుడైన నాయకుడిని తెలంగాణ బాధ్యతల్లోకి తీసుకురావాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.



**ముకుల్ వాస్నిక్ పేరు ప్రముఖంగా**

మీనాక్షి నటరాజన్ స్థానంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ దళిత నేత ముకుల్ వాస్నిక్ పేరు ప్రముఖంగా ప్రచారంలోకి వచ్చింది. మహారాష్ట్రకు చెందిన వాస్నిక్ రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మాజీ మంత్రిగా పనిచేశారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన ఆయనకు పార్టీ వ్యవహారాలపై సుదీర్ఘ అనుభవం ఉంది. గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో పార్టీ ఇన్‌ఛార్జ్‌గా పనిచేసిన అనుభవం కూడా ఆయనకు ఉంది. వివిధ వర్గాల నాయకులతో సమన్వయం చేయగల సామర్థ్యం ఉన్న సీనియర్ నేతగా వాస్నిక్‌కు కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంది. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని వర్గానికి, పాత కాంగ్రెస్ సీనియర్ నాయకులకు మధ్య ఉన్న విభేదాలను సద్దుమణిగించడం కొత్త ఇన్‌ఛార్జ్‌కు ప్రధాన బాధ్యతగా మారనుంది. రాష్ట్రంలోని పలువురు సీనియర్ నేతలతో ముకుల్ వాస్నిక్‌కు వ్యక్తిగత సంబంధాలు ఉండటంతో.. ఇరు వర్గాల మధ్య సమన్వయం సాధించగలరనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో ఉంది. పార్టీ, ప్రభుత్వం మధ్య కమ్యూనికేషన్ లోపం కూడా మరో కీలక అంశంగా మారింది. నామినేటెడ్ పదవుల భర్తీ, కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకాలు, జిల్లా స్థాయిలో కేడర్‌కు ప్రాధాన్యం వంటి విషయాల్లో పాత నాయకుల్లో అసంతృప్తి ఉంది.

**స్థానిక ఎన్నికలపై ప్రత్యేక దృష్టి**

రాబోయే గ్రేటర్ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించడం కొత్త ఇన్‌ఛార్జ్ ముందున్న మరో సవాలు. అభ్యర్థుల ఎంపిక, సీట్ల సర్దుబాటు, కేడర్ సమన్వయం వంటి అంశాల్లో పారదర్శకత పాటించాల్సి ఉంటుంది. ఈ వ్యవహారాల్లో ముకుల్ వాస్నిక్ అనుభవం ఉపయోగపడుతుందని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. సామాజిక న్యాయం, బీసీ, దళిత అజెండాతో ప్రభుత్వం ముందుకు సాగుతున్న సమయంలో సీనియర్ దళిత నేతకు రాష్ట్ర బాధ్యతలు అప్పగించడం పార్టీకి రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యం కలిగించే అంశంగా మారనుంది. ముకుల్ వాస్నిక్ నియామకం ఖరారైతే.. రేవంత్‌రెడ్డి నాయకత్వం, సీనియర్ల అసంతృప్తి మధ్య సమన్వయానికి ఆయన కీలకంగా వ్యవహరించే అవకాశం ఉంది.




# బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదు

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రతి సాంకేతిక మార్పును ప్రశ్నించినట్లుగానే ఏఐ విషయంలోనూ జరుగుతోందని, దాన్ని స్వీకరించి ముందుకు సాగాలని సూచించారు. తన ప్రసంగంలో తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని వివరించిన కేటీఆర్.. నిర్దిష్టత, అవకాశాలు అనే 2 కాన్సెప్ట్‌ల ద్వారా రాష్ట్ర అభివృద్ధి నమూనాను వివరించారు. మౌలిక వసతులు, విశ్వసనీయ ప్రజాసేవలతో ప్రజలకు నిర్దిష్టమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు.. ఇన్నోవేషన్, వ్యవస్థాపకతను ప్రోత్సహించే ఇకోసిస్టమ్‌ను నిర్మించాలని అన్నారు. సాగునీరు, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాల్లో తెలంగాణ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కరువు ప్రభావిత తెలంగాణ ప్రాంతాలకు గోదావరి జలాలను తరలించేందుకు రూపొందించిన ఇంజినీరింగ్ పరిష్కారంగా అభివర్ణించారు. వరి ధాన్యం ఉత్పత్తి 2014-15లో 44.4 లక్షల టన్నుల నుంచి 2023-24లో 168.8 లక్షల టన్నులకు పెరిగిందన్నారు. టీహబ్, వీహబ్, టీవర్క్స్, టాస్క్ సంస్థల పాత్రను కేటీఆర్ వివరించారు. వ్యవస్థాపకత, మహిళలకు అవకాశాలు, నమూనా రూపకల్పన, హార్డ్‌వేర్ ఇన్నోవేషన్, యువతను పరిశ్రమలతో అనుసంధానం చేయడంలో వీటి సేవలను ప్రస్తావించారు. ఇంక్యుబేషన్ నుంచి మార్కెట్‌కు సిద్ధమైన సంస్థగా ఎదిగిన స్కైరూట్‌ను తెలంగాణ ఇన్నోవేషన్ వ్యవస్థకు ఉదాహరణగా పేర్కొన్నారు. పరిమితులను సమస్యలుగా చూడకుండా నిరంతరం నేర్చుకోవడం, మెరుగుపడటం, అమలు చేయడంపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులతో ముచ్చటించే అవకాశం కల్పించిన ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ యాజమాన్యానికి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ సీ. రాజ్ కుమార్‌కు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

# భారత్–న్యూజిలాండ్ వాణిజ్య బంధం

**(మొదటిపేజీ తరువాయి)**



ఎఫ్‌టీఏ అమల్లోకి వస్తే ఇరు దేశాల మధ్య వాణిజ్యానికి సుంకాల పరంగా వెసులుబాటు కలగనుంది. వస్త్రాలు, ఔషధాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఆటోమొబైల్స్, బాస్మతి బియ్యం వంటి భారతీయ ఉత్పత్తులకు న్యూజిలాండ్ మార్కెట్‌లో అవకాశాలు పెరగనున్నాయి. న్యూజిలాండ్ ఎగుమతులకు కూడా భారత్‌లో మెరుగైన మార్కెట్ ప్రవేశం లభించనుంది.

**15 ఏళ్లలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు**

ఒప్పందంలో భాగంగా రాబోయే 15 ఏళ్లలో భారత్‌లో 20 బిలియన్ డాలర్ల వరకు ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించే లక్ష్యాన్ని న్యూజిలాండ్ నిర్దేశించింది. ఇది తప్పనిసరి పెట్టుబడి హామీ కాకుండా.. ఇరు దేశాల మధ్య పెట్టుబడులను పెంచే ఉద్దేశంతో రూపొందించిన లక్ష్యంగా న్యూజిలాండ్ ప్రభుత్వం పేర్కొంది. దేశీయ పాడి రైతుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ పాల ఉత్పత్తులపై భారత్ సుంకాల మినహాయింపును ఇవ్వలేదు. ఈ అంశం న్యూజిలాండ్ పాడి పరిశ్రమకు సంబంధించిన ఆందోళనలను దృష్టిలో పెట్టుకుని ఒప్పందంలో కీలకంగా నిలిచింది. భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏ చట్టపరమైన అమలుకు అవసరమైన మార్పులను న్యూజిలాండ్ పార్లమెంట్ ఆమోదించింది.

# నిమజ్జనంలో విషాదం.. ఆరుగురు విద్యార్థులు మృతి

**మృతుల్లో గీసుగొండ మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు**

**కాకతీయ, గీసుగొండ:** వినాయక నిమజ్జన వేడుకల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలోని నేరేడు చెరువులో నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లు సమాచారం. మృతుల్లో గీసుగొండ మండలం బాలయ్యపల్లి గ్రామానికి చెందిన రాయగిరి గణేష్, నల్ల సిద్ధార్థ ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. రాయగిరి గణేష్ బాలయ్యపల్లికి చెందిన రాయగిరి లింగమూర్తి, అనిత దంపతుల కుమారుడు కాగా, నల్ల సిద్ధార్థ నల్ల అశోక్, ఉమా దంపతుల కుమారుడు. వీరిద్దరూ ఓ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యనభ్యసిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వినాయక నిమజ్జన కార్యక్రమంలో భాగంగా చెరువులోకి వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వీరు మృతి చెందినట్లు సమాచారం. ఆరుగురు విద్యార్థుల మృతితో పెద్దకంజర్లతో పాటు బాలయ్యపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా తెలియాల్సి ఉంది.



రాయగిరి గణేష్ మృతదేహం



నల్ల సిద్ధార్థ మృతదేహం

# 22ఏ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

**(మొదటిపేజీ తరువాయి)**

రైతులు కరెంటు సమస్యలతో ఆందోళనలు చేస్తున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ వైఫల్యాలను టీషర్టులపై రాసుకొచ్చినందుకు బూతు పదాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని విమర్శించారు. తాము కావాలని సభ నుంచి బయటకు రాలేదని, పక్కా పథకం ప్రకారం గెంటేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి విషయంలో జరిగిన పరిణామాలపై కనీసం మైక్ ఇవ్వాలని అడిగినందుకే సస్పెన్షన్ వేటు వేశారని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభలో ఉంటే ప్రభుత్వ కుంభకోణాలు, కుటుంబ అవినీతి బయటపడతాయనే భయంతోనే మొత్తం సమావేశాలకు సస్పెండ్ చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. సస్పెన్షన్ ఎత్తివేస్తే ఆధారాలతో సభకు వస్తామని తమ ఎమ్మెల్యేలు సవాల్ చేసినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. కమ్యూనిస్టు, బీజేపీ సభ్యులు కూడా సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరినా ముఖ్యమంత్రికి ఆ దమ్ము లేదని విమర్శించారు.

**22ఏ జాబితాపై సీఎం చెప్పిన లెక్కలేంటి?**

22ఏ నిషేధిత భూముల విషయంలో బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు అక్షరసత్యమని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఒప్పుకున్నారని హరీశ్‌రావు అన్నారు. 3.71 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉంటే, అది 30 లక్షల ఎకరాలకు పెరిగిందని ముఖ్యమంత్రే చెప్పారని పేర్కొన్నారు. దీనివల్ల ఎన్ని లక్షల కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కలెక్టర్లు దబాదబా సంతకాలు చేసి జాబితాలను అప్‌లోడ్ చేశారని సీఎం చెబుతున్నారని, మరి తప్పు చేసిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క ఎకరా కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెబుతుండగా, అధికారులే 30 లక్షల ఎకరాలను అప్‌లోడ్ చేశారని సీఎం అంటున్నారని, ఇందులో ఎవరి మాట నిజమో ప్రభుత్వం స్పష్టం చేయాలని అన్నారు. 1999 నాటి పాత జాబితాను కలెక్టర్లు అప్‌లోడ్ చేశారని, ప్రభుత్వం విక్రయించిన హెచ్ఎండీఏ, యూఎల్‌సీ భూములు కూడా నిషేధిత జాబితాలో చేరడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని ముఖ్యమంత్రే అంగీకరించారని హరీశ్‌రావు తెలిపారు. దీనికి బాధ్యత వహించి ప్రజలకు క్షమాపణలు చెప్పడంతో పాటు సమస్యను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**సీఎం ఇంటి భూమి తొలగించినట్లే ప్రజల భూములూ తొలగించాలి**

ముఖ్యమంత్రి ఇల్లు రాత్రికి రాత్రే 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లే సామాన్యుల ఆస్తులను కూడా తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. చట్టం సామాన్యుడికైనా, ముఖ్యమంత్రికైనా ఒకటే ఉండాలని అన్నారు. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించేందుకు కమిటీలు వేస్తామని, మార్గదర్శకాలు ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని, కానీ స్పష్టమైన పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసేందుకే ఈ నాటకాలు సాగుతున్నాయని ఆరోపించారు. 2023 డిసెంబర్ 7 నుంచి




ఇప్పటి వరకు ఎన్ని భూములను నిషేధిత జాబితాలో చేర్చారు, ఎన్ని భూములను తొలగించారు అనే వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. 22ఏ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్, మేడ్చల్, మల్కాజిగిరి తదితర ప్రాంతాల నుంచి ప్రజలు తెలంగాణ భవన్‌కు వచ్చి తమ సమస్యలు చెబుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన రిజిస్ట్రేషన్లు ఇప్పుడు ఆగిపోయాయని ప్రజలు వాపోతున్నారని అన్నారు. సీఎం, మంత్రులు తనతో కలిసి ప్రజల మధ్యకు వస్తే అసలు సమస్య ఎవరి హయాంలో వచ్చిందో నిరూపిస్తానని సవాల్ చేశారు. టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినా దోషులు ఎవరో తేల్చలేదని విమర్శించారు.

**భూభారతిలోనూ భారీ అక్రమాలు జరిగాయి**

భూభారతి వ్యవహారంలో జనగామ ఛాలెంజ్ క్యాంప్ స్కామ్‌ను బీఆర్ఎస్ బయటపెట్టిందని, దీనివల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని హరీశ్‌రావు అన్నారు. దీనిపై ప్రభుత్వం తీసుకున్న చర్యలేంటో, ఏ అధికారిపై చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. భూభారతి ద్వారా 9,200కు పైగా భూముల రిజిస్ట్రేషన్లు యజమానులకు తెలియకుండానే జరిగాయని ఆరోపించారు. గజ్వేల్‌లో క్యాన్సర్ చికిత్స పొందుతున్న మహిళకు తెలియకుండానే ఆమె భూమి బదిలీ అయిందని పేర్కొన్నారు. ధరణి ద్వారా కొన్ని లక్షల లావాదేవీలు నిమిషాల్లో జరిగాయని, చిన్నచిన్న పొరపాట్లు ఉంటే సరిదిద్దాల్సింది పోయి భూభారతి పేరుతో కుంభకోణాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. నాదర్‌గుల్‌లో రూ.10 వేల కోట్ల భూకుంభకోణాన్ని ఆధారాలతో బయటపెట్టినా ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి సోదరుడికి సంబంధించిన టెస్క్ కంపెనీకి కోట్ల విలువైన భూముల కేటాయింపు, పసుమాములలో మరో సోదరుడి భూమికి నాలా కన్వర్షన్ అంశాలపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల భూములను ముంబై స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కుదువపెట్టి వేల కోట్లు అప్పులు తెచ్చింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమేనని ఆరోపించారు.

**బీఆర్ఎస్ హయాంలో పేదలకు పట్టాలు ఇచ్చాం**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 11 లక్షల 19 వేల మంది రైతులకు ఉచితంగా సాదాబైనామాలు చేశామని హరీశ్‌రావు తెలిపారు. 58, 59 జీవోల ద్వారా లక్షల కుటుంబాలకు పట్టాలు ఇచ్చామని చెప్పారు. జీవో 76 ద్వారా సింగరేణి కార్మికులకు ఇస్తున్న పట్టాలను, జీవో 118 కింద ఎల్‌బీ నగర్‌లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమ నాయకుడని, ప్రాణాలకు తెగించి రాష్ట్రాన్ని సాధించిన ఆయనపై అడ్డగోలు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందని గతంలో చెప్పి, ఇప్పుడు 67 ఎకరాలు అంటున్నారని పేర్కొన్నారు. మరోవైపు రేవంత్‌రెడ్డి కుటుంబానికి ఆయన, ఆయన కుమారుడు, తమ్ముళ్ల పేర్లతో 308 ఎకరాల ఆస్తులు ఉన్నట్లు తమకు సమాచారం అందిందని ఆరోపించారు. కొత్రా గ్రామంలో 175 ఎకరాలకు సంబంధించిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని, కొండారెడ్డిపల్లిలో 79 ఎకరాలు, అఫిడవిట్ ప్రకారం మరో 54 ఎకరాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తన వ్యవసాయ భూముల వివరాలు ఎన్నికల అఫిడవిట్, ఆదాయపన్ను రిటర్నుల్లో స్పష్టంగా ఉన్నాయని హరీశ్‌రావు చెప్పారు. తన భూమిని సర్వే చేసిన అధికారులే 2 గుంటలు తక్కువగా ఉందని తేల్చారని అన్నారు. తన బంధువులు చట్టబద్ధంగా కంపెనీ షేర్లు కొనుగోలు చేశారని, ప్రతి రూపాయి వైట్ మనీయేనని స్పష్టం చేశారు. అమెరికాలో 30 ఏళ్లుగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న వారు, 2010 నుంచి పౌల్ట్రీ వ్యాపారంలో కొనసాగుతూ 2019లో రాజ్ బ్రీడర్స్ కంపెనీ షేర్లను బ్యాంకు చెక్కుల ద్వారా కొనుగోలు చేశారని వివరించారు.

**రెండు ప్రభుత్వాల భూ వ్యవహారాలపై విచారణకు సిద్ధం**

ధరణి, భూభారతి వ్యవహారాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగిన అన్ని నిర్ణయాలు, రిజిస్ట్రేషన్లు, భూ కేటాయింపులపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హరీశ్‌రావు అన్నారు. రేవంత్‌రెడ్డి గత పదేళ్లలో టీఆర్ఎస్ పాలనలో, ప్రస్తుత మూడేళ్లలో సంపాదించిన ఆస్తులపైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితా, భూభారతి స్కామ్, ధరణి లావాదేవీలు, ప్రభుత్వ భూముల కేటాయింపులపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. ప్రజల ఆస్తులతో చెలగాటమాడకుండా ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన పరిష్కారం ప్రకటించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# 14 మంది డీజే ఆపరేటర్ల బైండోవర్

- డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగిస్తే చర్యలు
- చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ హెచ్చరిక



**కాకతీయ , చిగురుమామిడి :** వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగంపై ముందస్తు చర్యలు చేపట్టినట్లు చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ తెలిపారు. మండలంలోని 14 మంది డీజే ఆపరేటర్లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని 17 గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు, ఊరేగింపుల సందర్భంగా డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదని ఆపరేటర్లకు స్పష్టంగా సూచించినట్లు ఎస్సై తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని, పోలీసుల ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం లేకుండా ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరఫున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై జగదీశ్వర్ వివరించారు

# కూల్చివేతలే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా

**శ్రీనివాస్ నగర్ బాధితులకు మాజీ మంత్రి పువ్వాడ మద్దతు**



**కాకతీయ, ఖమ్మం :** కాంగ్రెస్ ప్రభుత్వానికి విధ్వంసం, కూల్చివేతలు తప్ప మరో ఎజెండా కనిపించడం లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులకు ఆయన మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల కోసం కొత్తగా నిర్మించిన ఇళ్ల కంటే, వివిధ కారణాలతో కూల్చివేసిన ఇళ్లే ఎక్కువగా ఉన్నాయని పువ్వాడ ఆందోళన వ్యక్తం చేశారు. వికాసం, అభివృద్ధి చేపట్టడం చేతకాని ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడుతోందని మండిపడ్డారు. పేదల ఇళ్లను కూల్చివేసి వారి జీవనోపాధిపై ప్రభావం చూపడం సరికాదని, పేదల పొట్ట కొట్టే చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇళ్ల కూల్చివేత ఆలోచనను వెంటనే విరమించుకోవాలని కోరారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఖమ్మం నగరంలో అనేక మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించడంతో పాటు, పేదలకు గృహ వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గుర్తు చేశారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధికి నిదర్శనమైతే, ఇప్పుడు పేదల ఇళ్లు కూల్చివేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మిగిలిన ఘనతగా మారిందని ఆయన విమర్శించారు.

# పోటాపోటీ వేలంలో లడ్డూ 10 ఏళ్ల మహతి సొంతం



**కాకతీయ, గుంటూరు :** వినాయక చవితి ఉత్సవాలలో లడ్డు పాట ఒక ప్రత్యేకతను చాటి చెప్పుకుంటుంది. బొజ్జ గణపయ్య చేతిలో పూజలు అందుకున్న లడ్డుని పాడటం కోసం అనేకమంది పోటీ పడుతుండటం మనం టీవీల్లో చూస్తూనే ఉంటాం. అత్యంత భక్తిశ్రద్ధలతో పాటు పూజలు అందుకున్న లడ్డుని పాడటం ఒక శుభపరిణామంగా పాటిస్తాము. అలా లడ్డు పాటలను టీవీల్లో చూసిన మండలి జయలక్ష్మీ మహతీ నాయుడు అనే 10 సంవత్సరాల చిన్నారి తాను పాటలో పాల్గొని లడ్డూ సొంతం చేసుకుంది. రేపల్లె మున్సిపాల్టీ పరిధిలోని మునుసుబువారిపాలెం రామాలయంలో లడ్డు పాటలో పాల్గొని ఐదు కిలోల లడ్డూను రు. 7116 కు మహతీ సొంతం చేసుకుంది. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన లడ్డు పాట పోటీలో 10 ఏళ్ల పాప మహతీ పోటీ పడి మరీ లడ్డూ పాట పాడడం విశేషం. ఎంతో అదృష్టంగా భావించే లడ్డు పాటలో పాల్గొని లడ్డు దక్కించుకోవటం చిన్నతనంలోనే ఆధ్యాత్మిక భావనలతో లడ్డు పాడటం సంతోషాన్ని కలిగించిందని మహతి తల్లిదండ్రులు ఏకాంబరేశ్వర రావు, అంజలి, మేనమామ ఉమ్మారెడ్డి బాబి హర్షం వ్యక్తం చేశారు.

# విషపదార్థం కలిసిన పిండితిని 17 పశువులు అస్వస్థత

**కాకతీయ, ఇనుగుర్తి:** మండలంలోని లాలు తండా పంచాయతీకి చెందిన తండావాసులు తమ మేకలు, గొర్రెలను బుధవారం శివారు అడవిలో మేపేందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు పిండిలో విషపదార్థం కలిపి ఉంచగా, దాన్ని తిన్న 15 మేకలు, 2 గొర్రెలు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. వెంటనే కాపరులు పశువైద్యాధికారులకు సమాచారం అందించారు. స్పందించిన పశువైద్యాధికారి రవీందర్ అక్కడికి చేరుకుని పశువులకు సకాలంలో చికిత్స అందించారు. దీంతో అవి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాయి. వెంటనే స్పందించి పశువులను కాపాడిన పశువైద్యాధికారి రవీందర్‌కు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# నామినేటెడ్ రేసులో మొలుగూరి యాకయ్యగౌడ్?

- పీసీసీ అధ్యక్షుడితో వరుస భేటీలు
- పార్టీ బలోపేతానికి ఏళ్లుగా కృషి
- బీసీ వర్గాల సమీకరణలో కీలక పాత్ర
- తెలంగాణ తల్లి విగ్రహం సొంత ఖర్చులతో ఏర్పాటు
- భారత్ జోడో యాత్ర నుంచి స్థానిక ఎన్నికల వరకు చురుకైన సేవలు
- సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల్లో గుర్తింపు



**కాకతీయ, జనగామ :** కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన మొలుగూరి యాకయ్యగౌడ్ పేరు ఆశావహుల జాబితాలో వినిపిస్తోంది. పార్టీ కోసం ఏళ్లుగా పనిచేయడంతోపాటు బీసీ వర్గాల సమీకరణ, కార్మికుల సమస్యలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆయనకు పదవి దక్కుతుందనే ఆశలు అనుచరుల్లో నెలకొన్నాయి. ఈ క్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను యాకయ్యగౌడ్ 4, 5 సార్లు కలిసి తన సేవలను వివరించినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. మొలుగూరి యాకయ్యగౌడ్ గౌడ కుల సంఘాల రాష్ట్ర నాయకుడిగా 10 ఏళ్లపాటు పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆయన.. అనంతరం పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ కార్యకర్తలను సమీకరించారు. పార్టీ కష్టకాలంలోనూ కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరం కాకుండా పనిచేశారని అనుచరులు చెబుతున్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో యాకయ్యగౌడ్ చురుకుగా పాల్గొన్నారు. కార్మిక వర్గానికి మద్దతుగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ ప్రజాస్వామ్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొని వారి సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లారు.

**తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు**

పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని యాకయ్యగౌడ్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ప్రోత్సాహం అందించారు. విగ్రహ ప్రతిష్ఠాపన ద్వారా పార్టీ కార్యక్రమాల్లో తన చురుకైన పాత్రను మరోసారి చాటుకున్నారు. గతంలో బీఆర్ఎస్ నాయకుల భౌతిక దాడిని ఎదుర్కొన్నప్పటికీ పార్టీ కోసం పనిచేయడం కొనసాగించారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినీరెడ్డి విజయానికి బీసీ ఓటర్లను సమీకరించడంలో కీలకంగా పనిచేశారని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

**స్థానిక ఎన్నికల్లోనూ చురుకైన పాత్ర**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పలు గ్రామాల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి యాకయ్యగౌడ్ కృషి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్యకర్తలను సమన్వయం చేసి కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు కూడగట్టారు. పాలకుర్తి నియోజకవర్గంలోని చెన్నూరు గ్రామానికి చెందిన ఆయనకు స్థానికంగా బీసీ వర్గాలతో మంచి పరిచయాలు ఉన్నాయని అనుచరులు చెబుతున్నారు. యాకయ్యగౌడ్ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గత 3 విద్యా సంవత్సరాల్లో పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గొడుగులు అందించారు. విద్యార్థులు, కార్మికులు, పేద కుటుంబాలకు సహాయం చేస్తూ సామాజిక సేవలోనూ ముందున్నారు. నామినేటెడ్ పదవి దక్కితే పాలకుర్తిలో పార్టీ బలోపేతంతోపాటు బీసీ వర్గాల సమీకరణకు ఆయన సేవలను వినియోగించుకోవచ్చని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు ఎమ్మెల్యేలు, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య యాకయ్యగౌడ్ సేవలను పార్టీకి ఉపయోగించుకోవాలని సూచిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏళ్లుగా పనిచేస్తున్న కార్యకర్తలకు అవకాశం కల్పిస్తే కొత్త నాయకత్వం ఎదుగుతుందని నియోజకవర్గ నాయకులు చెబుతున్నారు.

# గుంపు మేస్త్రీ, గుంటనక్క కుమ్మక్కు వాస్తవం

- సీఎం ప్రస్తావించిన భూములపై సమగ్ర విచారణ జరపాలి
- అఫిడవిట్ కంటే గజం ఎక్కువున్నా ప్రభుత్వానికి అప్పగిస్తా
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత




**కాకతీయ, హైదరాబాద్:** ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న భూముల కంటే గజం భూమి ఎక్కువగా ఉన్నట్లు తేలినా ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. అసెంబ్లీలో 22ఏపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబానికి భూములు ఉన్నట్లు ప్రస్తావించిన అంశంపై ఎక్స్ వేదికగా స్పందించారు. సీఎం అసెంబ్లీలో పేర్లు ప్రస్తావించిన వారందరి భూములపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో సీఎం చదివిన భూముల చిట్టాలోని అంశాలపై నిజాలు నిగ్గు తేలాలంటే సీబీఐ విచారణ అవసరమని కవిత అన్నారు. సీఎం ప్రస్తావించిన గుంటనక్క, కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉండే సీఎం గూఢచారి సహా నవీన్‌రావు, కొండల్‌రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, ప్రతిమ శ్రీనివాస్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి తదితరుల భూములపై విచారణ జరిపించాలని కోరారు.

**భూముల వ్యవహారంలో నిజాలు బయటపెట్టాలి**

అసెంబ్లీలో సీఎం ప్రస్తావించిన వారిపై సరైన విచారణ జరుగుతుందన్న నమ్మకం తనకు లేదని కవిత వ్యాఖ్యానించారు. సీబీఐతో విచారణ జరిపిస్తేనే భూముల వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. తాను ఎప్పటి నుంచో చెబుతున్నట్లుగా గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని ఆరోపించారు. వారిద్దరూ కలిసి రాజకీయ డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా తనకు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న భూముల కంటే గజం అదనంగా ఉన్నట్లు తేలినా ఆ భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తానని కవిత మరోసారి స్పష్టం చేశారు. భూములపై ఆరోపణలు చేస్తున్న ప్రభుత్వం అందరికీ ఒకే విధమైన విచారణ వర్తింపజేసి నిజానిజాలను తేల్చాలని డిమాండ్ చేశారు.

# దసరాకు 13 రోజుల సెలవులు

- అక్టోబర్ 1 నుంచి 9 వరకు ఎస్ఏ-1 పరీక్షలు
- అక్టోబర్ 10 నుంచి 22 వరకు పాఠశాలలకు సెలవులు
- బతుకమ్మ, విజయదశమి నేపథ్యంలో వరుస సెలవులు
- తెలంగాణ విద్యాశాఖ తాజా ప్రకటన

**కాకతీయ, తెలంగాణ:** తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు విద్యాశాఖ కీలక ప్రకటన చేసింది. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ 1 పరీక్షల షెడ్యూల్‌తో పాటు దసరా సెలవుల తేదీలను ప్రకటించింది. అక్టోబర్ 1 నుంచి 9వ తేదీ వరకు ఎస్ఏ 1 పరీక్షలు నిర్వహించనుండగా.. అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులు ఇవ్వనున్నారు. దీంతో విద్యార్థులకు వరుసగా 13 రోజుల పాటు సెలవులు లభించనున్నాయి. అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. 6, 8వ తరగతులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 7వ తరగతికి మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుంది. 9వ తరగతికి మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, 10వ తరగతికి ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఏ రోజు ఏ సబ్జెక్టుకు పరీక్ష ఉంటుందనే పూర్తి టైమ్‌టేబుల్‌ను విద్యార్థులు తమ పాఠశాలల ద్వారా తెలుసుకోవాలని విద్యాశాఖ సూచించింది.

**పండుగల తేదీలు ఇవే**

అక్టోబర్ 10న దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 11న బతుకమ్మ ప్రారంభం, 19న సద్దుల బతుకమ్మ, 20న విజయదశమి జరగనున్నాయి. అక్టోబర్ 22 దసరా సెలవులకు చివరి రోజు కాగా.. అక్టోబర్ 23న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఎస్ఏ 1 పరీక్షలకు విద్యార్థులు ముందుగానే సిద్ధం కావాలని విద్యాశాఖ సూచించింది. పరీక్షలు పూర్తయిన వెంటనే సెలవులు ప్రారంభం కానున్నందున పాఠశాలలు అందించే పూర్తి టైమ్‌టేబుల్‌ను పరిశీలించి ప్రిపరేషన్ పూర్తి చేసుకోవాలని పేర్కొంది.





# డీజే మోతకు బ్రేక్.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**సీఐ విశ్వేశ్వర్ కౌన్సెలింగ్**

**కాకతీయ, గీసుగొండ:** గణేష్ నిమజ్జన ఉత్సవాల్లో డీజేల హోరుతో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గీసుగొండ పోలీసులు అప్రమత్తమయ్యారు. నిబంధనలు అతిక్రమించి అధిక శబ్దంతో డీజేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ డి. విశ్వేశ్వర్ స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా సీఐ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే మ్యూజిక్ ఆపరేటర్లు, సౌండ్ సిస్టమ్ యజమానులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమాల్లో డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి సంబంధించి న్యాయస్థానాల ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనలు, పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని సీఐ సూచించారు. నిర్ణీత పరిమితులకు మించి అధిక శబ్దంతో డీజేలు నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించవద్దని స్పష్టం చేశారు. నిమజ్జన ఊరేగింపుల సందర్భంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ నిమజ్జన ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా పోలీసులకు సహకరించాలని సీఐ విశ్వేశ్వర్ కోరారు .ఈ కార్యక్రమంలో ఎస్సైలు రవి, అనిల్ కుమార్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నా బ్యాంకు ఖాతాలు అన్‌ఫ్రీజ్ చేయండి

- కుటుంబ పోషణకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నా
- ఫ్రీజ్ చేసిన ఖాతాల్లో రూ.3 కోట్లు ఉన్నాయని పిటిషన్
- నిత్యావసరాలు, వైద్య ఖర్చులకు నగదు అవసరం
- ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** ఐబొమ్మ వెబ్‌సైట్ ద్వారా సినిమాల పైరసీకి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇమంది రవి మరోసారి నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. పోలీసులు ఫ్రీజ్ చేసిన తన బ్యాంకు ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశాడు. ఖాతాలు స్తంభించడంతో కుటుంబాన్ని పోషించుకోవడం కూడా కష్టంగా మారిందని కోర్టుకు విన్నవించాడు. నిత్యావసరాలు, మెడికల్ ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నాడు. సినిమా పైరసీ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు తనకు చెందిన పలు బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారని రవి పిటిషన్‌లో తెలిపాడు. ఆ ఖాతాల్లో సుమారు రూ.3 కోట్లు ఉన్నాయని పేర్కొన్నాడు. కుటుంబ అవసరాల కోసం కనీసం కొన్ని ఖాతాలనైనా అన్‌ఫ్రీజ్ చేయాలని కోరాడు. ఈ పిటిషన్‌పై నాంపల్లి 9వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు విచారణ చేపట్టనుంది.

**విదేశాల నుంచే నెట్‌వర్క్ నిర్వహణ**

విశాఖకు చెందిన ఇమంది రవి ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. అనంతరం ఐబొమ్మ, బప్పం టీవీ వంటి వెబ్‌సైట్ల ద్వారా సినిమాల పైరసీ నెట్‌వర్క్‌లో కీలకంగా వ్యవహరించినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు ఆరోపించారు. థియేటర్లలో విడుదలైన కొత్త సినిమాలను కొద్దిసేపటికే పైరసీ చేసి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచేవాడని తెలిపారు. కొంతకాలం విదేశాల్లో ఉన్న రవి అక్కడి నుంచే నెట్‌వర్క్‌ను నిర్వహించినట్లు దర్యాప్తులో గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. 2025 నవంబర్ 15న కూకట్‌పల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టు రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. దర్యాప్తులో భాగంగా ఐబొమ్మ, బప్పం టీవీకి సంబంధించిన పలు మిర్రర్ వెబ్‌సైట్లను బ్లాక్ చేసే చర్యలు చేపట్టారు.

**బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లకు ట్రాఫిక్ మళ్లింపు**

ఐబొమ్మ వెబ్‌సైట్లకు వచ్చే భారీ ట్రాఫిక్‌ను ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌ల వైపు మళ్లించినట్లు కూడా రవిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపైనా పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. రవిపై మొత్తం 5 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. దాదాపు 3 నెలలు జైలులో ఉన్న అతడికి ఈ ఏడాది ఫిబ్రవరి 17న హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఫిబ్రవరి 18న చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు.

# ఎమ్మెల్యే రేవూరి వర్సెస్ కౌన్సిలర్లు

- పరకాల మునిసిపాలిటీలో అధికార పార్టీ అసమ్మతి సెగలు
- కౌన్సిల్ సమావేశానికి దూరంగా 7 మంది కౌన్సిలర్లు
- కోరం లేక అధికార పక్షానికి ఇబ్బందులు.. ఎమ్మెల్యే రేవూరికి గ్యాప్
- ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ కౌన్సిలర్ల నారాజ్
- హైదరాబాద్‌కు పిలిపించి సముదాయించినా.. కుదరని నమ్మకం
- పైకి కూల్.. లోపల కుతకుత.. పనులపై విజిలెన్స్‌కు బీఆర్ఎస్ నేత ఫిర్యాదు?!




**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** పరకాల మునిసిపాలిటీలో అధికార కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి రాజుకుంటోంది. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి, అధికార పార్టీ కౌన్సిలర్లకు మధ్య గ్యాప్ ఏర్పడిందన్న చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. మునిసిపాలిటీలో కౌన్సిలర్ల మధ్య కూడా విభేదాలు ముదురుతున్నట్లు సమాచారం. పైకి అంతా సవ్యంగానే కనిపిస్తున్నా.. లోపల మాత్రం అసంతృప్తి అగ్గి రాజుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశానికి అధికార పార్టీకి చెందిన 7 మంది కౌన్సిలర్లు దూరంగా ఉండటం ఈ విభేదాలకు బహిరంగ సంకేతంగా మారింది. అధికార పక్షానికి చెందిన సభ్యులే సమావేశానికి హాజరుకాకపోవడంతో కోరం లేక ఇబ్బందులు తలెత్తిన విషయం తెలిసిందే. దీంతో ఎమ్మెల్యే రేవూరికి, కౌన్సిలర్లకు మధ్య సమన్వయం ఏ స్థాయిలో ఉందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఎమ్మెల్యే రేవూరికి కౌన్సిలర్లకు మధ్య పెరిగిన దూరం**

పరకాల మునిసిపాలిటీలో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు తమను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్న అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. వార్డుల అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపు, కాంట్రాక్టుల వ్యవహారం, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో తమకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని పలువురు కౌన్సిలర్లు భావిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో పార్టీ కోసం పనిచేసిన తమను పక్కనపెట్టి.. కొందరికే ప్రాధాన్యం ఇస్తున్నారన్న అభిప్రాయం వారిలో బలపడినట్లు తెలుస్తోంది. మునిసిపాలిటీలో నిర్ణయాలు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయా? కౌన్సిలర్లను కేవలం సమావేశాలకు పరిమితం చేస్తున్నారా? అన్న చర్చ మొదలైంది. ప్రజల నుంచి ఎన్నుకోబడిన కౌన్సిలర్లకు పనులు, అధికారిక గుర్తింపు, రాజకీయ ప్రాధాన్యం లేకపోతే పార్టీకి ఎందుకు మద్దతు ఇవ్వాలన్న ప్రశ్న వారిలో తలెత్తినట్లు సమాచారం.

**కౌన్సిల్ మీటింగ్‌కు దూరంగా 7 మంది**

ఇటీవల జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశానికి అధికార పార్టీకి చెందిన 7 మంది కౌన్సిలర్లు గైర్హాజరు కావడం పరకాల రాజకీయాల్లో కలకలం రేపింది. ప్రతిపక్ష సభ్యులు దూరంగా ఉండటం ఒక ఎత్తయితే.. అధికార పార్టీ కౌన్సిలర్లే సమావేశానికి రాకపోవడం మరో ఎత్తుగా మారింది. కోరం లేక సమావేశం నిర్వహణపై ఇబ్బందులు ఏర్పడటంతో అధికార పక్షం ఇరకాటంలో పడినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం వెనుక వ్యక్తిగత కారణాలా? లేక ఎమ్మెల్యే రేవూరి తీరుపై అసంతృప్తితో ఉద్దేశపూర్వకంగా దూరంగా ఉన్నారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. కౌన్సిలర్ల గైర్హాజరును సాధారణ విషయంగా కొట్టిపారేయలేమని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అధికార పార్టీకి చెందిన సభ్యులు ఒకేసారి దూరంగా ఉండటం వెనుక అంతర్గత విభేదాలే కారణమన్న ప్రచారం జోరందుకుంది. కౌన్సిలర్ల మధ్య నెలకొన్న అసమ్మతి ఇప్పుడు మునిసిపల్ పాలనపైనా ప్రభావం చూపే పరిస్థితికి చేరిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**న్యాయం చేస్తానని హామీలు.. ఆర్థికంగా ఆదుకుంటానని భరోసా**

పరిస్థితిని చక్కదిద్దేందుకు ముఖ్యనేత కౌన్సిలర్లకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇకపై అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యం కల్పిస్తామని, వార్డుల సమస్యలను పరిష్కరించేందుకు సహకరిస్తామని చెప్పినట్లు తెలుస్తోంది. అవసరమైతే ఆర్థికంగా కూడా ఆదుకుంటానని భరోసా ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే గతంలో ఇచ్చిన హామీలు అమలుకాలేదన్న భావనతో కౌన్సిలర్లు ఈసారి మాటలను పూర్తిగా నమ్మలేదని తెలుస్తోంది. చర్చల అనంతరం పరిస్థితి తాత్కాలికంగా చల్లబడినట్లు కనిపిస్తున్నా.. అసమ్మతి పూర్తిగా తొలగిపోలేదన్న ప్రచారం కొనసాగుతోంది. హామీలతో కౌన్సిలర్లను సముదాయించవచ్చా? లేక మునిసిపాలిటీలో అధికార పంపకాలు, పనుల కేటాయింపు, రాజకీయ ప్రాధాన్యంపై స్పష్టత ఇవ్వాల్సిందేనా? అన్నది ఇప్పుడు కీలకంగా మారింది. మాటలతో మంట ఆరినట్లు కనిపించినా.. లోపల బూడిద కింద నిప్పులు మిగిలే ఉన్నాయన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

**"పనులన్నీ మీరే చేసుకుంటే.. మేం ఏం కావాలి?"**

కౌన్సిలర్లను సముదాయించేందుకు కాంగ్రెస్‌కు చెందిన ఓ ముఖ్యనేత రంగంలోకి దిగినట్లు సమాచారం. హైదరాబాద్‌కు పిలిపించి మరీ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు తమ అసంతృప్తిని దాచుకోకుండా నేరుగా ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. "ఉన్న పనులన్నీ మీరే చేసుకుంటే మేం ఏం కావాలి?", "చైర్మన్ సంగతిని ఆయన చూసుకుంటే.. మరి మా గతేం కాను?", "మమ్మల్ని పట్టించుకోకుంటే మేం ఎందుకు సపోర్ట్ చేయాలి?" అంటూ ముఖ్యనేతను నిలదీసినట్లు తెలుస్తోంది. మునిసిపాలిటీలో పనులన్నీ కొందరి చుట్టూనే తిరుగుతున్నాయని, తమ వార్డులకు నిధులు, పనులు, ప్రాధాన్యం దక్కడం లేదని కౌన్సిలర్లు స్పష్టం చేసినట్లు సమాచారం. పార్టీ అధికారంలోకి వచ్చినా తమ రాజకీయ భవిష్యత్తు, వార్డు ప్రజల ముందు తమ పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కౌన్సిలర్ల మాటల్లో అసంతృప్తి మాత్రమే కాకుండా.. తమను పక్కనపెడుతున్నారన్న ఆవేదన కూడా వ్యక్తమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**పైకి అంతా ఓకే.. లోపల మాత్రం కుతకుత**

పరకాల మునిసిపాలిటీలో అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్య అసమ్మతి రాజేస్తోందన్న విషయం స్పష్టమవుతోంది. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి, కౌన్సిలర్లకు మధ్య ఏర్పడిన గ్యాప్ ఈ విభేదాలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు కౌన్సిలర్ల మధ్య కూడా ఎవరి వర్గం వారు అన్న పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. కొందరికి మాత్రమే ప్రాధాన్యం దక్కడం, మరి కొందరిని పట్టించుకోకపోవడం వల్ల అంతర్గత అసంతృప్తి పెరుగుతున్నట్లు సమాచారం. మునిసిపల్ చైర్మన్ వ్యవహారాలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ, కాంట్రాక్టుల కేటాయింపు వంటి అంశాలు కూడా విభేదాలకు ఆజ్యం పోస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఏకతాటిపై ఉండాల్సిన సమయంలో.. ఒకరిపై ఒకరు అసంతృప్తితో ఉండటం పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారింది. ప్రస్తుతం పైకి అంతా కూల్‌గా వ్యవహరిస్తున్నా.. లోపల మాత్రం కుతకుత కొనసాగుతోందని తెలుస్తోంది. ఎప్పుడు ఏ రూపంలో విభేదాలు బయటపడతాయోనన్న ఉత్కంఠ నెలకొంది.

## మునిసిపల్ పనులపై విజిలెన్స్‌కు బీఆర్ఎస్ నేత ఫిర్యాదు?!

ఇదిలా ఉండగా పరకాల మునిసిపాలిటీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై బీఆర్ఎస్‌కు చెందిన ఓ నేత విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పనుల నాణ్యత, అంచనా వ్యయం, పనుల కేటాయింపు, బిల్లుల చెల్లింపులు, కాంట్రాక్టర్ల ఎంపిక తదితర అంశాలను ఫిర్యాదులో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. మునిసిపాలిటీలో జరుగుతున్న పనులకు సంబంధించిన పరిపాలనా అనుమతులు, సాంకేతిక అనుమతులు, టెండర్ ప్రక్రియ, కొలతల పుస్తకాలు, బిల్లుల వివరాలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందన్న డిమాండ్ వినిపిస్తోంది. విజిలెన్స్‌కు ఫిర్యాదు అందిందా? అందితే ఏ అంశాలపై విచారణ చేపట్టారు? పనుల రికార్డులు స్వాధీనం చేసుకున్నారా? నాణ్యతపై తనిఖీలు జరిగాయా? అన్న వివరాలు వెల్లడికావాల్సి ఉంది. అధికార పార్టీలో కౌన్సిలర్ల అసమ్మతి ఒకవైపు.. మునిసిపల్ పనులపై విజిలెన్స్ ఫిర్యాదు మరోవైపు ఉండటంతో పరకాల రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఎమ్మెల్యే రేవూరి ఈ విభేదాలకు ఎప్పుడు తెరదించుతారు? కౌన్సిలర్లకు సముచిత ప్రాధాన్యం కల్పించి పార్టీని ఏకతాటిపైకి తీసుకువస్తారా? లేక అసమ్మతి మరింత ముదిరి మునిసిపల్ పాలనను ప్రభావితం చేస్తుందా? అన్నది వేచి చూడాలి.

## మోదీ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పిలుపు**




**కాకతీయ,వరంగల్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను ప్రజల్లోకి తీసుకెళ్లేలా వరంగల్ జిల్లావ్యాప్తంగా విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సత్యం కన్వెన్షన్ హాల్‌లో సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కార్యశాల జరిగింది. జిల్లా కన్వీనర్ డాక్టర్ రాణా ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి గంట రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెలరోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్ - జన్ సేవ హీ ప్రభు సేవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గంట రవికుమార్ తెలిపారు. ప్రధాని మోదీ ప్రజా సేవను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. జిల్లా కన్వీనర్ డాక్టర్ రాణా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ అభియాన్ విజయవంతానికి రూట్‌మ్యాప్ సిద్ధం చేశామన్నారు. రక్తదాన శిబిరాలు, ఆశీర్వాద దీపం, పారిశుధ్య కార్యక్రమాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కోకన్వీనర్లు గార్లపాటి మంజులరెడ్డి, పొనుగోటి వెంకట్‌రావు, ఎర్రగొల్ల భరత్‌వీర్, చిలువేరు రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్‌షా, జలగం రంజిత్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు టేకుమట్ల రేణుక, నాయకులు బైరి శ్యాంసుందర్, గుర్రాల చంద్రమౌళి, తక్కళ్లపల్లి అమృతరావు, కట్ల రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షులు, కోకన్వీనర్లు పాల్గొన్నారు.

## సబ్బండ వర్గాలు ఐక్యంగా ఉద్యమించాలి

- అక్టోబర్ 2న జనగామలో వేడుకలను విజయవంతం చేయాలి
- మన ఆలోచన మన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నరసింహులు పిలుపు



**కాకతీయ, జనగామ:** నల్ల నర్సింలు 100వ జయంతి వేడుకలను గ్రామ గ్రామాన వైభవంగా నిర్వహించాలని మన ఆలోచన మన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నరసింహులు పిలుపునిచ్చారు. బుధవారం జనగామ పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం పట్టణ అధ్యక్షులు దోర్నాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కటకం నరసింహులు మాట్లాడుతూ బలహీన, అట్టడుగు, మైనార్టీ వర్గాల అభివృద్ధి కోసం సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. పార్టీలకు అతీతంగా సబ్బండ వర్గాలు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. అక్టోబర్ 2న జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించే నల్ల నర్సింలు శత జయంతి వేడుకలను బీసీలంతా కలిసి విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో నల్ల నర్సింలు విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వేముల బాలరాజ్, మాజీ జడ్పీటీసీ చింతకింది అరుణ, దాసరి జనార్ధన్, చింతకింది కృష్ణమూర్తి, డాక్టర్ శ్రీనివాస్, ఎనగందుల కృష్ణ, గునిగంటి రామకృష్ణ, మధుసూదన్, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పేరిట వందల కోట్లు ఆవిరి

- ఏటా నాటుతున్నా కనిపించని పచ్చదనం
- ఐదేళ్ల లెక్కలపై విచారణకు ప్రజల డిమాండ్

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** మొక్కలు నాటే పేరుతో వందల కోట్లు ఖర్చు చేస్తున్నా పచ్చదనం కనిపించడం లేదని, నిధుల వినియోగంపై లెక్కలు వెల్లడించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వరంగల్ బల్దియాలో హార్టికల్చర్ విభాగం తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకే ప్రాంతంలో ఏటా మొక్కలు నాటడం, అవి ఎండిపోవడంతో మళ్లీ నాటడం పరిపాటిగా మారిందని ఆరోపణలు ఉన్నాయి. మొక్కలు 85% నుంచి 95% వరకు బతికినట్లు రికార్డుల్లో చూపుతున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని ప్రజలు అంటున్నారు. గత ఐదేళ్లలో ఎన్ని మొక్కలు నాటారు, ఎంత ఖర్చు చేశారనే వివరాలు వెల్లడించాలని కోరుతున్నారు. మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



## నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

- అనారోగ్య బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతో సాయం మంజూరు
- విశ్వకర్మ సంఘం రాష్ట్ర నాయకులు కొండపర్తి బాలబ్రహ్మచారి

**కాకతీయ, హన్మకొండ :** నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని విశ్వకర్మ సంఘం రాష్ట్ర నాయకులు కొండపర్తి బాలబ్రహ్మచారి అన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రాసోజు లక్ష్మీనారాయణ చారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కును బుధవారం ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాలబ్రహ్మచారి మాట్లాడుతూ రాసోజు లక్ష్మీనారాయణ చారి అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో సమస్యను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. మంత్రి వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారని వివరించారు. సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం ఆర్థిక సాయం మంజూరు చేసిందన్నారు. మంజూరైన చెక్కును బాధిత కుటుంబానికి అందజేసినట్లు తెలిపారు. సాయం అందేలా చొరవ చూపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి బాలబ్రహ్మచారి, బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## టీపీటీఎఫ్ సభ్యత్వానికి వేముల ప్రకాష్ రాజీనామా

**పీఆర్‌టీయూ టీఎస్‌లో చేరిన ఉపాధ్యాయుడు**



**కాకతీయ, పెద్దవంగర :** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి పనితీరుకు ఆకర్షితులై ఉపాధ్యాయుడు వేముల ప్రకాష్ పీఆర్‌టీయూ టీఎస్ సంఘంలో సభ్యత్వం తీసుకున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షులు గంగిశెట్టి రమేష్‌కుమార్ తెలిపారు. టీపీటీఎఫ్ సంఘ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి పీఆర్‌టీయూ టీఎస్‌లో చేరినట్లు చెప్పారు. టీచర్స్ బడి వెబ్‌సైట్ ద్వారా ఉపాధ్యాయులకు సేవలు అందించిన వేముల ప్రకాష్ చిట్టి జాబిలి ఛానెల్ సృష్టికర్తగా, టీఎల్ఎం మేకర్‌గా, వర్క్‌షీట్ రూపకర్తగా సేవలందిస్తున్నారని రమేష్‌కుమార్ వివరించారు. ఉపాధ్యాయ సంఘాల్లో అతిపెద్ద సంఘమైన పీఆర్‌టీయూ టీఎస్ ద్వారానే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమవుతాయనే విశ్వాసంతో సంఘంలో చేరినట్లు వేముల ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యాకూబ్ పాషా, సభ్యులు యాకూబ్‌రెడ్డి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ టెండర్లు వేగవంతం చేయాలి

- 15 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలి
- సీడీఎంఏ డాక్టర్ టీకే శ్రీదేవి ఆదేశం

**కాకతీయ, హనుమకొండ:** గ్రేటర్ వరంగల్ మహానగర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు టెండర్ ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేసి పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ టీకే శ్రీదేవి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రాజెక్టు డీపీఆర్, టెండర్ ప్రక్రియ, పనుల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. హనుమకొండ కలెక్టరేట్ నుంచి ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, కమిషనర్ టి. వెంకన్న, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు. డీపీఆర్‌కు సంబంధించిన అంశాలను సమగ్రంగా క్రోడీకరించి, అవసరమైన ప్రక్రియలు పూర్తి చేయాలని సీడీఎంఏ సూచించారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ టెండర్ల ఆహ్వానానికి చర్యలు చేపడతామని తెలిపారు. ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రవికుమార్, సీపీఓ రవీంద్ర రాడేకర్ తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యం

- వర్షా కాలంలో ఇబ్బందులు లేకుండా రెయిన్‌కోట్లు అందజేత
- ఎలాంటి వాతావరణంలోనైనా విధులు సమర్థవంతంగా నిర్వహించాలి
- పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ రవీందర్ పులిగిల్ల



**కాకతీయ, వరంగల్ :** హోంగార్డుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని చలి, వర్షాకాలంలో విధులు నిర్వహించేందుకు అవసరమైన రెయిన్‌కోట్లను పోలీస్ ట్రైనింగ్ కాలేజ్, వరంగల్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవీందర్ పులిగిల్ల, ఐపీఎస్ మాట్లాడుతూ హోంగార్డులు ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. వర్షాకాలంలో ఇబ్బందులు కలగకుండా రెయిన్‌కోట్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు కే.రమేష్, కే.విజయ్, యస్.వేంకటేశ్వరరావు, కే.రవీందర్, డి.సోమాని, సీఐలు యం.రామ్మూర్తి, కే.అశోక్, యం.రజ్యాలక్ష్మి, ఆర్ఐలు టి.చంద్రశేఖర్, యస్.మహేష్, ఆర్ఎస్ఐ పి.అరుణ, సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

## ప్లాన్ ప్రకారమే భవన నిర్మాణాలు చేపట్టాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే ఇబ్బందులు తప్పవు
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే భవన నిర్మాణాలు చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న స్పష్టం చేశారు. బుధవారం హన్మకొండలోని గోపాల్‌పూర్, కాజీపేట, ప్రకాశ్‌రెడ్డిపేట, పద్మాక్షి కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్మించిన భవనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీకి సంబంధించి నిర్మాణాల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా అదనపు నిర్మాణాలు చేపట్టవద్దని, నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. ప్లాన్‌కు, వాస్తవ నిర్మాణానికి వ్యత్యాసం లేకుండా చూసుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవన్నారు. పరిశీలనలో సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, టీపీఓ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్రయోజనాలు కల్పించాలి

- అర్హులకు సకాలంలో ప్రభుత్వ సహాయం అందించాలి
- కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశం

**కాకతీయ, ములుగు ప్రతినిధి :** లొంగిపోయిన మావోయిస్టుల పునరావాస ప్రక్రియను వేగవంతం చేసి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ ప్రయోజనాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం, ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు, ఉపాధి అవకాశాలపై చర్చించారు. పెండింగ్ అంశాలను పరిశీలించి తదుపరి చర్యలపై నిర్ణయాలు తీసుకున్నారు. దరఖాస్తులు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జీ, ములుగు డీఎస్పీ రవీందర్, జిల్లా అధికారులు రామ్మోహన్, రవీందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266